

హంపనా చేతుల మీదుగా దసరా ఉత్సవాలు

● వేడుకలు ప్రారంభించనున్న సాహితీవేత్త హంప నాగరాజయ్య ● సీఎం సిద్దరామయ్య ప్రకటన

బెంగళూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక మైసూరు దసరా ఉత్సవాలను ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య ప్రారంభించనున్నారు. మైసూరులో శుక్రవారం సీఎం సిద్దరామయ్య ఈ విషయాన్ని ప్రకటించారు. ఇటీవల కేబినెట్ సమావేశంలో పలువురి పేర్లు ప్రస్తావనకు వచ్చినా ముఖ్యమంత్రిదే తుది నిర్ణయంగా మంత్రులు తేల్చారు. ఈ మేరకు హంప నాగరాజయ్య పేరును ఖరారు చేసినట్లు సీఎం వెల్లడించారు. అక్టోబరు 3న మైసూరులో చాముండేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలను ఆయన ప్రారంభించనున్నారు.

కన్నడ సాహిత్య లోకంలో సుపరిచితులైన హంప నాగరాజయ్య (హంపనా)గా పేరొందారు. ఆయన గౌరిబిదనూరు తాలూకా హంపసంద్రకు చెందినవారు. పద్మనాభయ్య, పద్మావతమ్మల కుమారుడు నాగరాజయ్య. మైసూరు యూనివర్సిటీలో ఎంఏ చదివిన ఆయన బెంగళూరు యూనివర్సిటీలో డాక్టరేట్ పొందారు. కన్నడ అధ్యాపకులుగా కొనసాగిన ఆయన సాహితీరంగంలో నిరంతర సేవలందించారు. కన్నడ సాహిత్య పరిషత్ సభ్యుడిగా కొనసాగిన ఆయన నాడోజా పురస్కారాన్ని, కర్ణాటక సాహిత్య పురస్కారాన్ని, జానపద యక్షగాన అకాడమీ పురస్కారాన్ని, బాలసాహిత్యంలో జాతీయ పురస్కారాన్ని రాజ్యోత్సవ పురస్కారాన్ని పొందారు. గత ఏడాది వర్షాభావం కారణంగా సాధారణ దసరా వేడుకలు జరిపారు. ఈ ఏడాది ఆడంబరంగా జరపాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 14 గజరాజులు మైసూరులో రిహార్సల్స్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నాయి.




సాహితీవేత్త హంప నాగరాజయ్య

మైసూరు ప్యాలెస్‌కు లక్ష విద్యుత్ దీపాల అలంకరణ

దసరా ఉత్సవాల కోసం మైసూరు నగరాన్ని భారీగా విద్యుద్దీపాలంకరణ చేపట్టనున్నారు. ప్యాలెస్‌ను లక్ష విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. ఇప్పటికే పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. 20వేల పాత బల్బులను మార్పు చేశారు. నగరమంతటా విద్యుద్దీపాలంకరణ పనులు నెలాఖరుకు పూర్తి చేయనున్నారు.

ప్రజ్వల్ మంచి బాలుడు

● ఏ పాపం తెలియదు: తండ్రి రేవణ్ణ



బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పాపం ప్రజ్వల్‌కు ఏమీ తెలియదు.. మంచి బాలుడు అంటూ కుమారుడిపై తండ్రి మాజీ మంత్రి రేవణ్ణ ప్రేమాభిమానాలు చూపారు. శుక్రవారం హాసన్ జిల్లా ఆలూరులో జరిగిన జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్న ప్రజ్వల్ గురించి ప్రత్యేక అభిమానం ప్రదర్శించారు. తన కుమారుడికి ఏమీ తెలియదని మంచి బాలుడంటూనే, మరో మూడేళ్ళు మౌనంగా ఉండాలని ఆతర్వాత వడ్డీతో సహా తీర్చకపోతే తాను దేవెగౌడ కొడుకునే కాదని సవాల్ విసిరారు. నా చేతికి చిక్కకుండా ఎక్కడికి పోతారన్నారు. మాపై సవాళ్ళు చేసిన వారి పరిస్థితి ఏమయ్యిందో తెలుస్తుందన్నారు. అయితే రేవణ్ణ వ్యాఖ్యలపై సర్వత్రా చర్చలు జోరందుకున్నాయి. హాసన్ ఎంపీగా కొనసాగిన ప్రజ్వల్ రేవణ్ణ ఎంతోమంది మహిళలు, ఉద్యోగులు, పార్టీ మహిళా కార్యకర్తలను బెదరించి లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజ్వల్‌కు సంబంధించి ఎన్నో రాసలీలలు పెన్‌డ్రైవ్ ద్వారా వైరల్ కాగా దేశం విడిచి నెలరోజులకు పైగా పరారీలో ఉన్నారు. బెంగళూరుకు రాగానే అరెస్టు అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రజ్వల్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా బెయిల్ పిటీషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు తీర్పు పెండింగ్‌లో ఉంచింది.

ప్రాజెక్టులకు జలకళ..చెరువులు వెలవెల



అరకొరనీటితో నగరంలోని వల్లూరు చెరువు

● రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షాలు ● అయినా 40శాతం చెరువులకు నీరు కరువు
● నీరు మళ్లించడంపై ఆసక్తి చూపని అధికారులు ● దక్షిణ కర్ణాటక పాడి రైతుల్లో మరింత ఆందోళన




ధార్వాడ జిల్లాలోని ఓ చెరువు ఇలా..

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే అత్యధిక వర్షాలు కురిశాయి. తీరప్రాంత జిల్లాలు ఉత్తర కర్ణాటక, పశ్చిమ కనుమల ప్రాంతాల్లో దాదాపు వంద రోజులు వర్షాలు కురిసిన దాఖలాలూ ఉన్నాయి. జోరువానల కారణంగా పలు జలాశయాలు నిండుకుండలా మారాయి. ప్రాజెక్టులు నిండడంతో అన్నదాతల్లో ఉత్సాహం నెలకొంది. అయితే చెరువుల్లో మాత్రం నీరు కరువయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40శాతం చెరువుల్లో సగం కూడా నీరు చేరలేదు. జూన్ 1నుంచి సెప్టెంబరు 9 దాకా సాధారణ వర్షపాతం 733 మి.మీ కురవాల్సి ఉంది. అయితే 902 మి.మీ వర్షం కురిసింది. సాధారణం కంటే 23శాతం ఎక్కువ వర్షపాతం నమోదయ్యింది. ఇన్ని వానలు కురిసినా చెరువులు పూర్తిగా నిండలేదని వాతావరణ పరిశోధన అధికారులు ఓ నివేదిక విడుదల చేశారు. ఓవైపు ప్రాజెక్టులు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. కొన్నిచోట్ల నిరంతరంగా వర్షాలు కురిసినా చెరువులకు నీరు మళ్లించకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. రాష్ట్రంలో 3,683 చిన్న చెరువులు ఉన్నాయి. వీటిలో 40 శాతం చెరువులకు మాత్రమే సగం కంటే ఎక్కువ నీరు చేరింది. 50శాతం చెరువులకు 30-50శాతం నీరు చేరగా, పదిశాతం చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి.

లింగనమక్కి, సూపా, హారంగి, హేమావతి, కేఆర్ఎస్, కబిని, భద్ర, తుంగభద్ర, ఆల్మట్టి, నారాయణపుర జలాశయాలు పూర్తిగా నిండాయి. కొన్ని నెలల కాలంగా అవుట్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. వాణివిలాస్‌సాగర్ జలాశయంలో 71శాతం నీరు చేరింది. ఇన్‌ఫ్లో 693 క్యూసెక్కులు మాత్రమే ఉంది. ఇది పూర్తి కావడం కష్టమే అనిపిస్తోంది. మలెనాడు, కరావళి (తీరప్రాంత) జలాశయాలనుంచి చెరువులకు నీరు మళ్లించారు. బయలుసీమతోపాటు ఉత్తర కర్ణాటక, కావేరి నదికి అనుబంధమైన ప్రాజెక్టుల నుంచి చెరువులకు నీరు మళ్లించే ప్రక్రియ పూర్తి కాలేదు. తుమకూరు, చిత్రదుర్గ జిల్లాల చెరువులకు ఇంకా నీరు మళ్లించలేదు. సెప్టెంబరు నెలలోనూ చెరువులు ఎండినట్లుగానే ఉండడంతో రైతుల్లో ఆందోళన మొదలవుతోంది. దక్షిణ ప్రాంతంలో చెరువులకు సంతృప్తికరంగా వర్షాలు కురవలేదు. మరోవైపు చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. సరైన ప్రణాళికతో నదుల నుంచి నీరు మళ్లించి చెరువులను నింపాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పట్టనాలకు సమీపంలోని చెరువుల్లో నీరు రైతులకు, పలు అవసరాలకు, మూగజీవాల దాహం తీర్చుకోవడానికి ఉపయోగిస్తారు. అటువంటిది ఇలా ఎండిపోతుండంతపై పలు రైతుల్లో ఆందోళన మొదలయ్యింది.




ఉత్తర కర్ణాటకలో..



ఆరోగ్యఖరము..!

● గాడిద పాలకు పెరిగిన డిమాండ్ ● లక్షలు పలుకుతున్న గార్దభాలు ● పోషకాల నాణ్యతపై నిజాలెన్నో..?
● భారీ ఆదాయం ఆశతో ప్రాంచైజీల ఏర్పాటు ● అధికారుల దాడులతో ఖంగుతిన్న జెన్నీ మిల్క్ నిర్వాహకులు






బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20: 'గంగి గోవుపాలు... గరిటడైనా చాలు... కడవడైతెనేమీ ఖరము పాలు " అన్న వేమన పద్యం ఇప్పుడు వర్తించదేమో..ఒకప్పుడు గాడిద పాలంటే హేయంగా చూసేవారు. ఇప్పుడు వేలకు వేలు పోసి మరీ కొంటున్నారు. కర్ణాటకలోనే కాక ఆంధ్ర, తెలంగాణలో కూడా ఇటీవల ఏ ఇంట్లో పిల్లలు పుట్టినా రెండు, మూడు నెలల్లోగా గాడిద పాలు తాపిస్తే ఆరోగ్యకరమని, పిల్లలకు మంచిగా మాటలు వస్తాయని విస్తృత ప్రచారం సాగుతోంది. పట్టణాలు, పల్లెల్లో చాలా మంది గాడిదలు పట్టుకుని తిరుగుతూ గ్లాసులతో పాలు అమ్ముతున్నారు. గాడిద పాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో పాడి రైతులు కాస్త గాడిదల పోషణపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో గోవుపాలు లీటరు ధర రూ 50 నుంచి 60 రూపాయలు పలుకుతుండగా, గాడిద పాలు లీటరు ధర రూ.2500పైగా పలకడం ఆశ్చర్యం. దీంతో రైతులు లక్షలు వెచ్చించి గాడిద పిల్లలను కొనుగోలు చేస్తున్నారు.

గాడిద పాలతో వ్యాపారం

గాడిద పాలకు డిమాండ్ పెరగిపోవడంతో వ్యాపార సంస్థలు సైతం ఇందులోకి ప్రవేశించాయి. రైతులకు గాడిదలు, గాడిద పిల్లలు అందజేసి మరీ డెయిరీ ఫామ్ తరహాలో కేంద్రాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రధాన కేంద్రంగా కొంతమంది విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేటలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుని గాడిద పాల సేకరణకు యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. గాడిద పాలతో వ్యాపారం లక్షల్లో సాగుతుండం చూస్తుంటే జనాల్లో ఈ పాలపై ఎంత ఆసక్తి పెరిగిందో గమనించవచ్చు. ఇటీవల హొసపేట నగరంలో జెన్నీమిల్క్ పేరుతో ప్రారంభమైన కేంద్రంపై నగరసభ అధికారులు దాడులు నిర్వహించి సీజ్ చేయడంతో గాడిద పాలకు ఇంత డిమాండ్ ఉందా...? అన్న చర్చ మొదలయ్యింది. గాడిద పాలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, సోపులు, మందుల తయారీలో గాడిద పాలను ఉపయోగిస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. వీటిని శిశువులకు పట్టిస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఇటీవల జోరుగా ప్రచారం అందుకుంది. గతంలో కొంతమంది వ్యక్తులు గాడిదను వెంటబెట్టుకుని వీధుల్లో తిరుగుతూ అక్కడికక్కడే పాలు పితికి అందజేసేవారు. అయితే ప్రస్తుతం అదే గాడిద పాల సేకరణ ఆధునిక రీతిలో జరుగుతుండడం విశేషం. గాడిద పాల వ్యాపారం కారణంగా నెలకు రూ 60 నుండి70వేల వరకు ఆదాయం వస్తుందని జెన్నీమిల్క్ కంపెనీ వ్యవస్థాపకులు రైతులకు ఆశ చూపారు. ఇందుకోసం రూ.3 లక్షలు దండుకుని మూడు గాడిదలు, మూడు గాడిద పిల్లలు రైతులకు అందజేస్తున్నారు. మళ్లీ వాళ్ల దగ్గరే పాలను కొనేలా అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. దీంతో చాలామంది ఈ వ్యాపారంలోకి ప్రవేశించారు. కంపెనీ నిర్వాహకులకు లక్షలు చెల్లించి ప్రాంచైజీలు కూడా తీసుకున్నారు. హొస్పేట చుట్టు ప్రక్కల చాలామంది ప్రజలు గాడిదలను కొనుగోలుకు ఎగడడుతున్నట్లు సమాచారం. నిర్వాహకులు ఉత్తర కర్ణాటక ప్రాంతం నుండి గాడిదలను దిగుమతి చేసుకుని స్థానికులకు అమ్ముతున్నట్లు సమాచారం. మూడు పెద్దగాడిదలు, ముడు చిన్నగాడిద పిల్లలు చేరి ఒక యూనిట్‌గాను పిలుస్తారు. ప్రస్తుతం హొసపేట చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో 20 యూనిట్ల వరకు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే గాడిద పాల వ్యాపారం కాస్త జిల్లా పాలనా మండలికి తలనొప్పిగా మారింది. అసలు ఇవి ఆరోగ్యకరమా.. కాదా అని నిపుణులు తేల్చాలని, అసంబద్ధంగా అమ్మడం కుదరదని అధికారులు కేంద్రాలను మూసివేయించారు. అయితే లక్షలు చెల్లించి మోసమోయామని, న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.



గాడిద పాలను పితుకుతున్న మహిళ (ఫైల్)





పాల కేంద్రంపై దాడులు నిర్వహించిన అధికారులు (ఫైల్)

దేశ ఆర్థికాభివృద్ధే రామ్‌రాజ్ ఆశయం



చైర్మన్ కేఆర్ నాగరాజన్

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అమెరికా డాలర్‌తో భారత్ రూపాయి విలువ సమానంగా కావాలని, ప్రపంచంలోనే దేశం ఆర్థికంగా శక్తిశాలిగా రూపు దిద్దడమే రామ్‌రాజ్ కాటన్స్ ఆశయమని సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ పేర్కొన్నారు. శుక్రవారం బెంగళూరులో ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రగామి ఆర్థికశక్తి కేంద్రం కావాలన్నారు. దక్షిణభారత దేశ వ్యాప్తంగా కొత్త షోరూంలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కర్ణాటకలో పంచెకట్టును ప్రోత్సహించేందుకు రానున్న రోజులలో తాలూకా, హోబళి స్థాయిలోను కొత్తషోరూంలను తెరుస్తామన్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో 100 రకాల పంచెలను సిద్ధంగా ఉంచామన్నారు. దేశ సంస్కృతి పరంపర పండుగల వేళ ప్రత్యేకంగా ఉంటుందన్నారు. భారతీయ పరంపరను కాపాడటంతో పాటు భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. యువతకు మన సంస్కృతిని పరిచయం చేస్తున్నామన్నారు. రామరాజ్‌కు కాంతార ఫేం రిషబ్‌శెట్టి ద్వారా కొత్త విధానాలతో ప్రచారాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

50వేల మంది కుటుంబాలకు అండ

రామ్‌రాజ్ సంస్థ ద్వారా సుమారు 50వేల మంది చేనేత కుటుంబాలకు అండగా ఉన్నామన్నారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా రామరాజ్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామన్నారు. తిరుపూర్‌లో కేంద్ర కార్యాలయం ఉందని ఈరోడ్, మధురైలలో ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా 15వేల రిటైల్ దుకాణాలు ద్వారా రామరాజ్ వినియోగదారులకు అందించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. మలేషియా, శ్రీలంకలలో సముద్ర మార్గంగా మార్కెటింగ్ చేస్తున్నట్లు నాగరాజన్ తెలిపారు.

సింగనాయకనహళ్లిలో రామ్‌రాజ్ షోరూం

వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ కాటన్ షోరూం సింగనాయకనహళ్లిలో ఏర్పాటైంది. దీనిని శుక్రవారం యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ ప్రారంభించగా, ఆర్ఎస్ఎస్ఎన్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వాణిశ్రీ విశ్వనాథ్ జ్యోతిప్రజ్వలన గావించారు. విశ్వవాణి ఫౌండేషన్ డైరెక్టర్ అలోక్ విశ్వనాథ్ తొలి విక్రయాలను ప్రారంభించారు. ఇటీవల ధోతీ ధరించాడన్న కారణంగా ఓ షాపింగ్‌మాల్‌లోకి వెళ్లేందుకు నిరాకరణకు గురై వార్తల్లోకెక్కిన ఫక్కీరప్ప అనే రైతును ఛైర్మన్ నాగరాజన్ ఘనంగా సత్కరించారు.



షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,620.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,732	4378
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10132	9,968
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	62.92

చిరుత బారి నుంచి కాపాడాలి



ఆర్‌ఎఫ్‌ఓకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు20: చిరుతను బంధించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నేతృత్వంలో విజయనగరంజిల్లా రాయరకెరె(రాయల చెరువు), జంబునాథ్ హళ్ళి, రాజాపురం రైతులు ఆర్‌ఎఫ్‌ఓ భరత్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతు సంఘం కార్యదర్శి యల్లాలింగ మాట్లాడుతూ తాలూకాలోని రాయరకెరె, రాజాపుర, జంబునాథహళ్ళి ప్రాంత రైతులు మాట్లాడుతూ, పొలాల్లో అడవి మృగాల బెడద ఎక్కువైందన్నారు. చిరుతలు పెంపుడు జంతువులపై దాడి చేస్తున్నాయని, రైతులు పొలానికి వెళ్లాలంటనే భయపడుతున్నారన్నారు. తక్షణం చిరుతను పట్టి బంధించాలని, లేకుంటే ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలన్నారు. ఈసందర్భంగా వెంకోబ పూజార్, కట్టిగికరిహనుమ, మరడిబసవ, పూజారి దురుగప్ప, మంజునాథ, జంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి మృతి



మృతి చెందిన సిద్ధలింగయ్య, కొట్రయ్య (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా ఆలూరు గ్రామ సమీపంలో బుధవారం జాతీయ రహదారి 50పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుప్రక్కన నడుచుకుంటూ వెళుతున్న పాదచారులపై లారీ దూసుకెళ్లడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మృతి చెందిన వారిని ఆలూరుకు చెందిన సిద్ధలింగయ్య (39), చిత్రదుర్గ జిల్లాకు చెందిన మొళకాల్మూరు నివాసి కొట్రయ్య(26)లుగా గుర్తించారు. గాయపడిన మరో పాదచారిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఖానాహళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు.

కలుషిత ఆహారానికి వ్యతిరేకంగా ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20: నగరంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ వసతి నిలయాల్లో భోజనంలో కలుషిత ఆహారాన్ని ఇస్తున్నట్లు ఆరోపిస్తూ శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. వసతి నిలయంలోని మెనూ చార్ట్ ప్రకారం శుక్రవారం వగ్గరణ(ఉగ్గాణి)మిర్చి ఇచ్చారని, అందులో పురుగులు, వెంట్రుకలు వివిధ కీటకాలు ఉన్నాయని ఆరోపించారు. ఈవిషయంపై ఎన్నిసార్లు వార్డెన్‌కు తెలిపినా ఏవిధమైన ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణం ధర్నా స్థలానికి ప్రొఫెసర్ రుద్రేశ్ చేరుకుని విద్యార్థులతో చర్చించి ఇక ముందు ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సిరుగుప్పలో స్వచ్ఛతా కార్యక్రమం

సిరుగుప్ప, సెప్టెంబరు 20 : పరిసరాలు పరిశుభ్రంగా వుంటే మనుషులకు ఎలాంటి వ్యాధులు సోకవని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథ శెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలోని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని అవగాహన పెంచుకోవడం అత్యవసరమని తెలిపారు.

ఎరక్కపోయి ఇరుక్కున్నాం!

- గాడిదల కంపెనీని నమ్మి మోసపోయాం
- మా డబ్బు మాకిప్పించండి
- జెన్నీమిల్క్ కంపెనీపై 60 ఫిర్యాదులు



జెన్నీమిల్క్ కంపెనీపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్ ముందు క్యూకట్టిన ప్రజలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు20: 'పాడిపరిశ్రమతో ప్రశాంతంగా ఉన్న మాకు లేనిపోని ఆశలు చూపి లక్షలాది రూపాయలు తీసుకుని మమ్మలను గాడిదల కంపెనీ గాడిదలను చేసింది' అని రైతులు పోలీసు అధికారుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెన్నీమిల్క్ కంపెనీ తమనుంచి వసూలు చేసిన లక్షలాది రూపాయలు తిరిగి ఇప్పించేలా చూడాలని హొసపేట టౌన్ పోలీసులను ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల నుండి ఫిర్యాదులు వెల్లువలాగా రావడంతో ఎస్పీ హరిబాబు స్టేషన్‌లో మకాం వేసి రైతుల ఫిర్యాదులను పరిశీలించి జెన్నీమిల్క్ మేనేజింగ్ డైరెక్టర్ అన్వేషణకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

రైతులకు గాడిదలు పంపిణీచేసి వాటి పాలను కొనుగోలుచేస్తామని జెన్నిమిల్క్ సంస్థ రైతులకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. హొసపేట నగరంలో ఏర్పాటుచేసిన ఈ జన్నిమిల్క్ సంస్థపై ఇటీవల స్థానిక నగరసభ అధికారులు దాడులు నిర్వహించి దానిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రజల నుంచి సంస్థపై చర్యలు చేపట్టాలని డిమాండ్ పెరిగింది. గాడిదపాల వ్యవహారం ఇటు పోలీసు అధికారులకు, అటు నగరసభ అధికారులకు తలభారంగా మారుతోంది. చేసేది లేక ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను పోలీసులు రికార్డు చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా కంపెనీ ప్రధాన మేనేజింగ్ డైరెక్టర్ నూతలపతి మురళికోసం పోలీసులు వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. జెన్నీమిల్క్ సంస్థ ద్వారా మోసపోయినట్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300మందికిపైగా బాధితులు హొసపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల నుండి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జెన్నిమిల్క్ సంస్థ ఎండీ మురళి విదేశాలకు వెళ్లినట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఇందులో నిజానిజాల కోసం పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు.

ఈ సంస్థకు చెందిన మరో డైరెక్టర్ శంకర్ రెడ్డి, మరో ముగ్గురి కోసం పోలీసులు విమానాశ్రయాల్లో సైతం గాలిస్తున్నట్లు విజయనగర జిల్లా ఎస్పీ హరిబాబు మీడియాకు సమాచారం అందించారు. నగర పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి 9గంటల సమయంలో మల్లేశప్ప అనే వ్యక్తి జెన్నిమిల్క్ సంస్థ వ్యవహారంపై మొదట ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సంస్థ ఎండి, మేనేజర్, మరో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హొసపేట చుట్టుప్రక్కల వారితో పాటు రాష్ట్రంలోని ఏడుకు పైగా జిల్లాలకు చెందిన బాధితులు హొసపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చే యడంతో ఆ ఫిర్యాదుల సంఖ్య 60కి చేరినట్లు సమాచారం. ఇందుకోసం రెండు ప్రత్యేక కౌంటర్లను తెరచి పోలీసులు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల దారుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు పేర్కొంటున్నారు.

నేను ఎవరినీ మోసం చేయలేదు : ఎండీ

ఇది ఇలా ఉండగా, కంపెనీ ఎండీ నూతలపతి మురళి తన వినియోగదారులకు మూడు పేజీల లేఖను వాట్సప్ ద్వారా పంపినట్లు తెలిసింది. ఇందులో తాము వినియోగదారులను మోసం చేయలేదని, నిరంతరం వారి ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. సెప్టెంబరు 17వ తేదీన హొసపేటలో ఉన్న తన కార్యాలయాన్ని అధికారులు సీజ్ చేసిన తరువాత వినియోగదారుల నుండి ఫిర్యాదులు వస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో తన ఖాతాదారులకు ఇప్పటి వరకు రూ.4 కోట్ల రూపాయలు చెల్లించినట్లు, కార్యాలయం తెరవడానికి చాలా ఖర్చు చేసినట్లు లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. కంపెనీ మేనేజర్ శంకర్ రెడ్డి తనను మోసం చేసి నీళ్ళు కలిపిన పాలు సరఫరా చేయడంతో పాలు తిరస్కరణకు గురి అయ్యాయని, అందుచేత తాను భారీగా నష్టపోయానని పేర్కొన్నారు. హొసపేట నగరంలో తన నుంచి ఇద్దరు వ్యక్తులు డబ్బులు తీసుకున్నారని, ముగ్గురు అధికారులు కూడా తన నుంచి డబ్బు తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులు అంతా ఇదే వ్యాపారంలో నిమగ్నమైనట్లు, ప్రస్తుతం తాను దుబాయికి వెళుతున్నట్లు వాట్సప్ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

కనీస వేతనాల కోసం కేపీసీఎల్ కార్మికుల ధర్నా

కంప్లి, సెప్టెంబరు 20 : జిల్లా పరిధిలోని కుడితిని వద్ద వుండే కేపీసీఎల్‌లోని బీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికులు కనిష్ఠ వేతనాల కోసం కేపీసీఎల్ గేటు ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక హిత రక్షణ సమితి అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు సరియైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, 26 రోజుల కూలీ ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరి స్కిల్ పరిగణలోకి తీసుకుని కార్మికులను వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కార్మికులకు సరియైన వేతనాలు అందడం లేదన్నారు. అలాంటి కాంట్రాక్టర్‌పైన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న ఈడీ రాజు అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ, తమకు ఇచ్చిన ఐదు సమస్యలపైన కాంట్రాక్టర్లతో చర్చించి సరైన న్యాయం చేస్తామని తమకు 15 రోజులు గడువు ఇవ్వాలని కోరారు. 15 రోజుల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భారీ ఎత్తున రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు అధికారులు మోహన్‌రాజు, అశోక్, హాలబావి, హిత రక్షణ గౌరవాధ్యక్షులు వెంకటరమణబాబు, పట్టణపంచాయతీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, ప్రతాప్, జాకీర్, చంద్రయ్య దొడ్డబసప్ప, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్య వివరిస్తున్న హితరక్షణ సమితి అధ్యక్షుడు రాజశేఖర్



కేపీసీఎల్ ప్రధాన గేటు వద్ద కార్మికుల ధర్నా

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమని

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20:అసంఘటిత కార్మికులతో పాటు అన్ని వర్గాల కార్మికుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాలను జారీ చేశాయని, కార్మిక చట్టాల పట్ల ప్రతి ఒక్కరు జాగృతం కావాలని జిల్లా చట్టసేవ ప్రాధికార మెంబర్ సెక్రటరీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేజ్ ఎస్.హొసమని పేర్కొన్నారు. జిల్లా చట్టసేవ ప్రాధికార, కార్మిక శాఖ, కార్మిక రాష్ట్ర బీమా యోజన తదితర సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలోని కొట్టురుస్వామి మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న అసంఘటిత కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికులకు అందాల్సిన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. బళ్ళారి నగరంలో మహిళలు ఎక్కువగా గార్మెంట్ రంగంలో ఎక్కువగా పనిచేస్తున్నారని, మహిళలు పనులు చేయడంతో పాటు కార్మిక శాఖ నుంచి అందే సేవలు, సౌలభ్యాల గురించి తెలుసుకోవాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలు రూపొందించిందని, పథకం ఫలాలు నేరుగా కార్మికులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా చట్ట సేవా ప్రాధికార ఆధ్వర్యంలో కార్మికులు, మహిళలు, చిన్నపిల్లలు, సీనియర్ సిటిజన్‌లు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఉచితంగా చట్టసేవలను పొందవచ్చన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని

ఈ సందర్భంగా ఇఎస్ఐసియు శాఖ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర కార్మిక బీమా చట్టాలు, నియమాల గురించి కార్మికులకు అందే సౌలభ్యాల గురించి వివరించారు.

ఉప్పొంగుతున్న గంగమ్మ



గుత్తిగనూరు గ్రామంలో బోరు నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న నీరు

కంప్లి, సెప్టెంబరు 20 :సర్వత్రా భూగర్భజలం అడుగంటుతున్న ప్రస్తుత కాలంలో ఎలాంటి యంత్రాలు లేకుండానే కొన్నిచోట్ల గంగమ్మ ఉప్పొంగి ప్రవహిస్తోంది. కురుగోడు తాలుకా గుత్తిగనూరు గ్రామంలో గ్రామ నడిబొడ్డున గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి మోటార్లు, చేతి పంపులులేకుండానే నీరు భూమిపైకి ఉబికివస్తోంది. ఈ నీటి వల్ల సుమారు ఎనిమిది ఎకరాలలో వరి పంటను పండించుకుంటున్నారు. ఎంతో మంది నిపుణులు భూములను పరిశీలించి వేసిన బోర్లలోనే నీరుపడక ఇబ్బందులు పడుతున్న తరుణంలో గుత్తిగనూర బోరులో నీరు ఉప్పొంగడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

స్టాన్‌ఫోర్డ్‌శాస్త్రవేత్తల జాబితాలో వీఎస్‌కేయూ ప్రొఫెసర్లు



స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ ప్రకటించిన శాస్త్రవేత్తలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రతియేటా ప్రకటించే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విజ్ఞానుల జాబితాలో బళ్ళారిలోని విజయనగర శ్రీ కృష్ణదేవరాయల విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు ప్రొఫెసర్లకు స్థానం దక్కింది. కొప్పళ విశ్వవిద్యాలయంలో మూల్యాంకన విభాగంలో పనిచేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.ప్రసాద్, గణక విజ్ఞాన విభాగంలో ప్రొఫెసర్ హనుమేష్ వైద్య వరుసగా రెండోసారి ఈ జాబితాలో పేరు సంపాదించుకోవడం విశేషం. గణిత శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ అశ్విని మొదటి సారిగా స్థానం సంపాదించింది. మొత్తానికి విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన విజ్ఞానుల జాబితాలో ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా ముగ్గురు ప్రొఫెసర్లకు విజయనగర శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు, కొప్పళ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.రవి, రిజిస్ట్రార్ రుద్రేష్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న కల్లుకంబ పంపాపతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 20: ప్రభుత్వ కార్పొరేషన్ల బోర్డులు, సహకార బ్యాంకులు, ప్రభుత్వ హాస్టళ్ళు, పాఠశాలలు, కళాశాలలకు నామినేటెడ్ అధ్యక్షులు, సభ్యులను నియమించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కల్లుకంబ పంపాపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. నగరంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి ,మంత్రులకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈవిధంగా షెడ్యూల్డ్ కులాలు, మహిళలు, గ్రాడ్యుయేట్లకు రిజర్వేషన్ కల్పించే అంశాన్ని పరిశీలించాలని, ఇలా చేస్తే బళ్లారి జిల్లాలో 2,500 మంది పార్టీ కార్యకర్తలకు అవకాశం వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకోసం పనిచేసిన వారికి ప్రభుత్వం వెంటనే నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని కోరారు. కొన్నిసంఘాలకు మాత్రమే నగరంలో హాలు నిర్మాణానికి స్థలం ఇచ్చారన్నారు. ఒకే చోట సామూహిక వేదిక ఏర్పాటు చేయాలని, అన్ని వెనుకబడిన వర్గాల ప్రజలకు స్థలం ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఉద్యోగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల తయారీపై నిరుద్యోగ మహిళలకు శిక్షణ

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం సేవ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో 20 నుండి 45 ఏళ్ళ వయోపరిమితి పొందిన నిరుద్యోగ యువతులకు కృత్రిమ ఆభరణాల(కస్టమ్ జువెలరీ) తయారీలో ఉచిత శిక్షణను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల యువతులు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. అక్టోబరు 14వ తేదీ నుండి 13 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా శిబిరంలో ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ ఆభరణాలు తయారీలో ప్రాథమిక పరిజ్ఞానం ఉండి, బీపీఎల్ కార్డు పొందిన, కన్నడ భాష చదడం, రాయడం వచ్చిన ఆసక్తి గలిగిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాల కోసం నగరంలోని హొసపేట రోడ్డులో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థను 08392-299117 నెంబరులో సంప్రదించవచ్చని డైరెక్టర్ తెలిపారు.

నకిలీ హక్కుపత్రాలతో జాగ్రత్త

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 20:బళ్లారి సిటీ కార్పొరేషన్ నగరంలోని ఆశ్రయ యోజన క్రింద నిర్మాణమైన ఇళ్ళను వసతి రహిత కుటుంబాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిపై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు నకిలీ ప్రమాణ పత్రాలు తయారు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నగరంలోని పేద ప్రజలు మధ్యవర్తుల మాటలు నమ్మి నకిలీ ప్రమాణ పత్రాలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనుమానం వస్తే వెంటనే కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

హోసూరు జోన్

చంద్రచూడేశ్వర ఆలయ హుండీ లెక్కింపు



స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హోసూరు సెప్టెంబరు 20 : హోసూరు చంద్రచూడేశ్వర కొండ ఆలయంలో గత మూడు నెలలుగా భక్తులు ఇచ్చిన కానుకలను లెక్కిస్తే రూ.9,64,086 ఆదాయం వచ్చినట్లు తెలిసింది. హోసూరులో ప్రసిద్ధి చెందిన చంద్రచూడేశ్వర ఆలయంలో గత జూన్ 19 వ తేది నుంచి సెప్టెంబరు 20వతేదీ వరకు హిందు ధర్మాదాయ శాఖ అధికారులు, ప్రైవేట్ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులుచే భక్తుల కానుకలను లెక్కింపజేశారు. కార్యనిర్వాహణాధికారి సామిదురై ఆధ్వర్యంలో విరాళాల లెక్కింపు జరిగింది.

గుట్కా స్వాధీనం.. ఒకరి అరెస్ట్

హోసూరు(క్రైం) సెప్టెంబరు 20 : హోసూరు బస్ స్టేషన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో ఎస్ఐ ఫైయాజ్, పోలీసులు పహారా కాస్తూ ఓ అనుమానస్పద వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేశారు. అతనివద్ద తమిళనాడులో నిషేధించిన పొగాకు, గుట్కా పాకెట్లు ఉన్నట్లు తేలింది. పోలీసులు విచారణలో అతని పేరు హనీబా(38)అని, కర్ణాటక లోని అత్తిపల్లి నుంచి 9 కిలోల పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు తెలిసింది.

సహజ ఎరువుల ద్వారా పంటల సంరక్షణ

హోసూరు సెప్టెంబరు 20 : వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర విస్తరణ పథకాల సబ్సిడీ పునరావాస పథకం క్రింద చిత్తన్నపల్లి గ్రామంలో పత్తిలో సమగ్ర పంటల నిర్వహణపై 40 మంది రైతులకు శుక్రవారం అంతర్ జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భువనేశ్వరీ సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటల వల్ల కలిగే ప్రయోజనాలు, మట్టి నమూనా సేకరణ ప్రాముఖ్యత, వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సబ్సిడీ పథకాల వివరాలను రైతులకు వివరించారు. అదియమాన్ కళాశాల ఆఫ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, హరిణి పత్తిల్లో సమగ్ర పంట నిర్వహణ, నాణ్యమైన విత్తనాల ఎంపిక , పంట దిగుబడిని పెంచడానికి విత్తనోత్పత్తి మరయు మట్టిలో లేప్‌వార్మ్‌లను నియంత్రించడానికి సూడోమోనాస్ ఉపయోగించడం వల్ల ప్రయోజనాలు గురించి కూడా రైతులకు బయో ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయ అధికారిణి, రేణుక సింతటిక్ ఎరువులకు బదులు సహజసిద్ధమైన ఎరువులు వేసి దిగుబడిని పెంచే సాంకేతిక విధానాలు, పంచగవ్య , జీవామృతం తయారీ, 2 శాతం డీఏపీ ద్రావణాన్ని నేలపై పిచికారీ చేయడం వల్ల కలిగే లాభాలు, టిప్ పిన్నింగ్ వల్ల రైతులకు కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. దీని వల్ల ఎక్కువ పంట పండించవచ్చని తెలిపారు. డిప్యూటీ అగ్రికల్చర్ అధికారి మురుగేశన్, నేల భూసారాన్ని మెరుగుపరచడానికి సూక్ష్మ పోషక ఎరువులు, జీవ ఎరువులు వాడడం వల్ల ప్రయోజనాలు, విత్తన క్షేత్రాల ఏర్పాటు ప్రయోజనాలు, పద్ధతులను రైతులకు వివరించారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారి

గొర్రెల మందపై దూసుకెళ్లిన బస్సు



బస్సు దూసుకెళ్లడంతో మృతి చెందిన 150కి పైగా గొర్రెలు

రాయచూరు సెప్టెంబర్ 20: వేగంగా వెళుతున్న ప్రైవేటు బస్సు గొర్రెల మందపై నుంచి దూసుకెళ్లడంతో మందలోని 150 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన శుక్రవారం ఉదయం నగర సమీపంలోని యరమరస్ క్యాంప్ బైపాస్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి బెళగావికి వెళుతున్న వీఆర్ఎల్ సంస్థ బస్సు గొర్రెల మందపై వెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా 150కి పైగా గొర్రెలు మృత్యువాతపడి రోడ్డు పై చెల్లాచెదురుగా పడి ఉండడంతో గొర్రెల కాపర్లు చేస్తున్న చేసిన హాహాకారాలు చూపరులను కలిచివేశాయి. విషయం తెలుసుకున్న రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడికి వెళ్లిన జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రైవేటు బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

భారీ మొసలిని నిర్బంధించిన గ్రామస్థులు




గ్రామస్థులు నిర్బంధించిన భారీ మొసలి

రాయచూరు సెప్టెంబర్ 20 : తాలూకాలోని డిరాంపూర్ చెరువులో ఉన్న భారీ మొసలిని శుక్రవారం గ్రామస్థులు నిర్బంధించారు. చెరువులో నీరు తాగేందుకు వెళుతున్న పశువులు, గొర్రెలు, ఇతర జంతువులను మొసలి మింగుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు రెండు రోజులుగా కాపుగాసి మొసలిని వలలతో బంధించారు. విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలపగా వారు ఆ మొసలిని స్వాధీనం చేసుకుని తిరిగి దాన్ని కృష్ణా నదిలో వదిలివేశారు. కాగా చెరువులో మరో రెండు మొసళ్ల కూడా ఉన్నట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీటిపై నిఘా ఉంచి నిర్బంధిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

గురజాడ అప్పారావు (జయంతి)



సంఘ సంస్కర్తగా, అభ్యుదయ కవితా పితామహగా పేరొందిన గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21 విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలూకా ఎస్ రాయవరం గ్రామంలో జన్మించారు. రచనలతో సమాజంలో మార్పుకు ప్రయత్నించిన మహాకవి. హేతువాది. తెలుగు సాహిత్యంలో వాడుకభాష ఒరవడికి కృషి చేసి కవిశేఖర బిరుదు పొందారు. 19వ శతాబ్దంతోపాటు, 20వ శతాబ్దం మొదటి దశకంలో ఆయన చేసిన రచనలు నేటికీ మన్నన పొందుతున్నాయి. కన్యాశుల్కం నాటకంలోని గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు తదితర పాత్రలు పేరొందాయి. కన్నడ, ఫ్రెంచ్, రష్యన్, ఇంగ్లీషు, తమిళ, హిందీభాషలలోకి అనువాదమైంది. అభ్యుదయ కవితా పితామహగా పేరొందారు. 1915 నవంబరు 30న కన్నుమూశారు.

అద్దంకి శ్రీరామమూర్తి (జయంతి)



సుప్రసిద్ధ తెలుగు రంగస్థల, సినిమా నటుడు, సంగీత విశారదుడు అద్దంకి శ్రీరామమూర్తి 1898 సెప్టెంబరు 21న గుంటూరు జిల్లా కల్వకుర్తిలో జన్మించారు. సంగీత విద్వాన్‌గా అనేక పాటకచేరీలు నిర్వహించారు. ఈయన పాడిన పద్యాలు, కృతులు, శ్లోకాలు గ్రామ్‌ఫోన్ రికార్డులుగా ఇవ్వబడి ప్రచారం పొందాయి. తొలి సినిమా హరిశ్చంద్రలో అదేపాత్రలో నటించి మంచి పేరొందారు. ధర్మరాజు, దశరథుడి పాత్రలు ఎంతో గుర్తింపు పొందాయి. 25 సినిమాలలో నటించి అసమాన నటుడిగా పేరొందారు. 1968లో కన్నుమూశారు.

ప్రపంచం సీతారాం (జయంతి)



కర్ణాటక సంగీతంలో ప్రఖ్యాత వేణుగాన విద్వాంసుడిగా పేరొందిన ప్రొఫెసర్ ప్రపంచం సీతారాం 1942 సెప్టెంబరు 21న విజయవాడలో జన్మించారు. ఆలిండియా రేడియోలో టాప్ ఆర్టిస్ట్‌గా రాణించారు. సంగీతంలో డాక్టరేట్ పొందారు. కలైమామణి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళాశిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2014 జూన్ 1న కన్నుమూశారు.

అభినవ విద్యాతీర్థ స్వామి (వర్ధంతి)



శృంగేరీ శారదాపీఠం 35వ జగద్గురు అభినవ విద్యాతీర్థ మహాస్వామి 1917 నవంబరు 13న బెంగళూరులో జన్మించారు. పూర్వాశ్రమంలోని పేరు శ్రీనివాస శాస్త్రి. 14వ ఏటనే సన్యాసం స్వీకరించారు. చంద్రశేఖర భారతి మూడవ మహాస్వామి ఆయనను శృంగేరీ పీఠం 35వ జగద్గురుగా నియమించారు. శృంగేరిలో తుంగా నది ఒడ్డున బ్రిడ్జ్ కట్టేందుకు, శృంగేరిలో మౌలిక సదుపాయాలు పెరిగేందుకు చొరవ చూపారు. వేదంతోపాటు యోగాలోనూ నిపుణులు. ఆయన పేరిట స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేశారు. 1989 సెప్టెంబరు 21న మహాసమాధి అయ్యారు.

సింగీతం శ్రీనివాసరావు (పుట్టినరోజు)



సినీ రంగంలో తనదైన ప్రత్యేకత చాటుకున్న సింగీతం శ్రీనివాసరావు 1931 సెప్టెంబరు 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించారు. దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్‌రైటర్‌గా, కంపోజర్‌గా, గాయకుడిగా, స్వరకర్తగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తొలి మూకీ సినిమా పుష్పక విమానంకు సహ నిర్మాతయే కాక స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, హిందీ సినిమాలకు పనిచేశారు. రెండు జాతీయ, 7 రాష్ట్ర నంది పురస్కారాలు, 3 కర్ణాటక రాష్ట్ర ఫిల్మ్ అవార్డులు అందుకున్నారు.

కరీనా కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌కు చెందిన నటీమణి కరీనా కపూర్ 1980 సెప్టెంబరు 21న జన్మించారు. రాజ్‌కపూర్ మనుమరాలు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటీమణులలో ఒకరు. 6 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. డిజైనర్‌గాను రాణించారు. యునిసెఫ్‌తో కలసి బాలికావిద్యకు ప్రోత్సహిస్తున్నారు. సొంతంగా వస్త్రాలు, కాస్మోటిక్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నటుడు సైఫ్ అలీఖాన్‌ను పెళ్లాడారు. విద్య, మహిళా భద్రతకోసం తనవంతు కృషి చేస్తున్నారు.

దీపికా పళ్ళికాల్ (పుట్టినరోజు)



ప్రముఖ స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పళ్ళికాల్ కార్తీక్ 1991 సెప్టెంబరు 21న కేరళ రాష్ట్రం కొట్టాయంలో జన్మించారు. పిఎస్‌ఎ ఉమెన్స్ ర్యాంకింగ్‌లో టాప్10లో నిలిచిన తొలి భారతీయ యువతిగా గుర్తింపు పొందారు. పద్మశ్రీ, అర్జున అవార్డులు అందుకున్నారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం, 2016 సౌత్ ఏసియన్ గేమ్స్‌లోనూ బంగారు పతకం సాధించారు. ప్రముఖ క్రికెటర్ దినేశ్ కార్తీక్‌ను వివాహం చేసుకున్నారు. 2022 గ్లాస్గో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో దేశం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

కాంగ్రెస్‌లోకి 13 మంది జేడీఎస్ కౌన్సిలర్లు

● ఉప ఎన్నికల వేళ చన్నపట్టణంలో కుమార స్వామికి షాక్

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో హాట్ టాపిక్‌గా సాగుతున్న సందర్భంలోనే జేడీఎస్ పార్టీకి షాక్ తగిలింది. చన్నపట్టణ నగరసభలో 16మంది సభ్యులు జేడీఎస్ ద్వారా ఎన్నికైనవారు ఉన్నారు. వీరిలో ఏకంగా 13 మంది కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇండిపెండెంట్ సభ్యురాలు ఉమా కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. జేడీఎస్‌కు చెందిన 13మంది స్వంత నిర్ణయంతోనే కాంగ్రెస్‌లో చేరామని పార్టీలో విలీనంగా పరిగణించాలని జిల్లాధికారిని కోరారు. అందుకు జిల్లాధికారి కూడా సొంతనిర్ణయంగా ప్రకటించిన మేరకు పరిగణిస్తున్నట్లు తెలిపారు. మరి కొన్ని రోజుల్లో చన్నపట్టణ శాసనసభా స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న తరుణంలోనే డీకే శివకుమార్ పైచేయి సాధించగా కేంద్రమంత్రి కుమారస్వామి సొంతపార్టీకి చెందిన నగరసభ్యులను కోల్పోవడం పార్టీలో కలకలం రేపుతోంది.



కాంగ్రెస్‌లో చేరిన జేడీఎస్ నగర సభ్యులు వీరే

విలేజ్ అకౌంటెంట్‌పై దాడి

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 20: పంట సమీక్షకు వెళ్లిన విలేజ్ అకౌంటెంట్‌పై దాడి జరగడంతో ఉద్యోగి గాయపడ్డారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి గురువారం పంట సమీక్షకు అకౌంటెంట్ రాజేంద్రబాబు వెళ్లిన వేళ భూ యజమాని బంధువు వసంత్ కుమార్ దాడికి పాల్పడ్డాడు. దొడ్డబళ్ళాపుర తాలూకా సిద్దనాయకనహళ్ళి పరిధిలోని విలేజ్ అకౌంటెంట్ వర్షాకాల పంటను సమీక్షించేందుకు సుమారు 4 గంటలకు ఖాస్‌బాగ్ గ్రామ సర్వే 79/1బీకు వెళ్లారు. కృష్ణప్పకు చెందిన భూమిలో పంటల సమీక్ష సందర్భంగా కృష్ణప్ప సోదరుడు వసంతకుమార్ ఒక్కసారిగా అక్కడికి వచ్చి తల, ఛాతీపైదాడి చేసి తిట్టాడు. తీవ్రంగా గాయపడిన రాజేంద్రబాబు ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. విలేజ్ అకౌంటెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుపతి మాట్లాడుతూ ఏటా మూడు సార్లు పంటసమీక్ష చేయాల్సి ఉంటుందని, ఒక విలేజ్ అకౌంటెంట్ సుమారు 5 పల్లెలకు సంబంధించి సుమారు 1500 సర్వేనెంబర్లు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. నిరంతరం పని ఒత్తిడి ఉంటుందని ప్రస్తుతం పల్లెల్లో కారణాలతో దాడులు చోటు చేసుకుంటుండడంతో విధుల నిర్వహణ కూడా ప్రాణభయంతో చేయాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మనోజ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మినరసింహయ్య, విలేజ్ అకౌంటెంట్‌ల సంఘం తాలూకా అధ్యక్షుడు సీమంత్ తదితరులు ఘటనను ఖండించారు. ఘటనపై దొడ్డబళ్ళాపుర పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.



చికిత్స పొందుతున్న రాజేంద్రబాబు

ఎమ్మెల్యే మునిరత్న కేసుల విచారణకు సిట్

● ముఖ్యమంత్రికి వక్కలిగ శాసనసభ్యుల డిమాండ్



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న వక్కలిగ సమాజ శాసనసభ్యులు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరీనగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు సంబంధించి అన్ని కేసులను విచారించేందుకు ప్రత్యేకంగా సిట్‌ను ఏర్పాటు చేయాలని వక్కలిగ శాసనసభ్యులు సీఎం సిద్దరామయ్యను కోరారు. శుక్రవారం సీఎం అధికారిక నివాసం 'కృష్ణ'ను కలిసిన సందర్భంగా బీబీఎంపీ కాంట్రాక్టర్‌ను కులం పేరుతో దూషించడం, ఒక్కలిగ సమాజానికి చెందిన వారిని ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడడం, అత్యాచారం కేసులన్నింటినీ కలిపి విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రులు కృష్ణబైరేగౌడ, ఎంసీ సుధాకర్, పుట్టణ్ణ, శరత్‌బచ్చేగౌడ తదితరులున్నారు.

వర్షం కోసం బాలలకు పెళ్లి

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 20: వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. వర్షాలకోసం రైతులు పలు విధానాలు ఆచరిస్తుంటారు. ఈ తరుణంలో ఇద్దరు మగ పిలలకు పెళ్లి చేసి వర్షంకోసం ప్రార్థించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. తాలూకాలోని సాసలు హోబళి పచ్చార్లహళ్ళిలో ఒక పిల్లాడిని పెళ్లికొడుకుగా, మరో బాలుడిని పెళ్లికూతురుగా అలంకరించి పెళ్లి చేశారు. అనంతరం వర్షంకోసం ప్రార్థనలు చేశారు. కొంతమంది వీటిని మూఢాచారంగా కొట్టివేశారు. కొన్ని గ్రామాల్లో కప్పలు, గాడిదలకు పెళ్లిళ్లు చేయడం ఆనవాయితీ. అయితే ఇద్దరు బాలురకు పెళ్లి చేయడం చర్చనీయాంశంగా మారింది.



పెళ్లి వేడుకల్లో ఇద్దరు బాలురు..

జోయ్ అలుక్కాస్‌లో ప్రత్యేక ఆఫర్‌లు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల వ్యాపారంలో అంతర్జాతీయంగా పేరొందిన జోయ్ అలుక్కాస్ చెయిన్‌ఫెస్ట్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈమేరకు బెంగళూరులో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెయిన్ ఫెస్ట్ సెప్టెంబరు 20 శుక్రవారం నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకూ ఉంటుందన్నారు. వినియోగదారులు అన్ని రకాల చైన్‌లపైనా ఫ్లాట్‌గా 4.99శాతం తయారీ ఛార్జీలు అందిస్తోందన్నారు. బంగారు ఆభరణాల ప్రేమికుల కోసం వివిధ డిజైన్‌ల చైన్‌లు కొనుగోలు చేసుకోవడంతో పాటు ఆదా పొందేందుకు వీలుంటుందని ప్రకటించారు. ఉన్నతమైన నాణ్యత కలిగిన బంగారు ఆభరణాలను వినియోగదారులు పొందేలాంటి ఆఫర్‌లతో పరిశ్రమలలో ప్రత్యేక బెంచ్‌మార్క్‌ను నెలకొల్పేందుకు జోయలుక్కాస్ కొనసాగిస్తుందన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా ఆభరణాలు వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా ఉందన్నారు. ఫ్లాట్ రేటుకు విస్తృత శ్రేణి చైన్‌లను రోజువారి ధరించేందుకు లేదా ప్రత్యేక సందర్భాలలో ఆకర్షణీయమైన డిజైన్‌లు సిద్దంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్టోబరు 31వరకు ఉచిత కంటి పరీక్షలు

బెంగళూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కంటి సేవల రంగంలో పేరొందిన డాక్టర్ అగర్వాల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అక్టోబరు 31వరకు ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. నగరంలోని కెంగేరిలో ఆసుపత్రి శాఖ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు ఈ విషయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఎస్‌టి సోమశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆసుపత్రి శాఖను ప్రారంభించారు. బెంగళూరు పశ్చిమ విభాగం డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్ గిరీశ్ పాల్గొన్నారు. రోటరీకి చెందిన సీతారామశర్మ, వాసుప్రసాద్, స్నేహా సురేశ్, అగర్వాల్స్ ఆసుపత్రి క్లినికల్ సర్వీసెస్ ప్రాంతీయ ముఖ్యులు డాక్టర్ శ్రీపతి, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.



అగర్వాల్ ఆసుపత్రిశాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్

సంజు.. ఈశ్వరన్ శతకాలు

● నిరాశపరిచిన సూర్య కుమార్

● ఐదు వికెట్లు కూల్చిన నవదీప్ సైనీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20: స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో రెచ్చిపోతే చూడాలని ఆశించిన అనంత క్రీడాభిమానులకు నిరాశే ఎదురైంది. కేవలం ఐదు పరుగులకే 'స్కై' పెవిలియన్‌కు చేరింది. సంజు శ్యాంసన్, అభిమన్యు ఈశ్వరన్ సెంచరీలతో అలరించారు. ఏసీజీ-ఎ, బి మైదానాలలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు రెండో రోజు కొనసాగాయి. ఓవర్ నైట్ స్కోర్ 224-7తో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-ఎ జట్టు రెండో రోజు శుక్రవారం మరో 73 పరుగులు జోడించి 297 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 122 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన శశావత్‌రావత్ రెండు పరుగులు మాత్రమే జోడించి 124 పరుగులకు ఔట్ అయ్యారు. మరో బ్యాట్స్‌మన్ ఆవేశ్‌ఖాన్ 16 పరుగులతో ఆరంభించి అర్ధ సెంచరీ పూర్తి చేసి అవుట్ అ య్యారు. ప్రసిద్ధ్ కృష్ణ 34 పరుగులు సాధించగా, ఆఖీబ్‌ఖాన్ డకౌట్ అయ్యా రు. ఇండియా-సి బౌలర్లలో వైశాక్ విజయ్‌కుమార్ 4 వికెట్లు, అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, గౌరవ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. ఆ తరువాత మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-సి జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 64 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ 17 పరుగులు, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. రజిత్ పటిదార్ డకౌట్ కాగా, ఇషాన్ కిషన్ 5, మానవ్‌సుతార్ 2, అన్షుల్ కాంబోజ్ ఒక పరుగు చేశారు. బాబా ఇంద్రజిత్ 34 పరుగులతో రిటైర్డ్ హర్ట్ అయ్యారు. అభిషేక్ పోరెల్ 82 పరుగులు సాధించారు. పల్కిట్ నారంగ్ 35 పరుగులు, వైశాక్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇండియా-ఎ బౌలర్లలో ఆఖీబ్‌ఖాన్ 3 వికెట్లు, శాంష్ ములాని 2 వికెట్లు, ఆవేష్ ఖాన్, తనుష్ కొటియాన్ చెరో వికెట్ తీశారు.



అభిమానులను నిరాశపరిచిన సూర్యకుమార్ యాదవ్



ఐదు వికెట్లుతో రాణించిన నవదీప్‌సైనీ

శతకం బాదిన సంజు, అభిమన్యు ఈశ్వరన్

ఓవర్ నైట్ స్కోర్ 306-5తో రెండో ఆట ఆరంభించిన ఇండియా-డి జట్టు 349 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో రోజు 89 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన సంజు శ్యాంసన్ 106 పరుగులు సాధించారు. నవదీప్‌సైని బౌలింగ్‌లో నితీష్‌కుమార్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి వెనుతిరిగారు. శరాన్ష్ జైన్ మరో 4పరుగులు జోడించి 26 పరుగులకు ఔటయ్యారు. సౌరభకుమార్ 13 పరుగులు, అర్షదీప్ సింగ్ 11 పరుగులు చేయగా, ఆకాష్‌సేన్ గుప్తా డకౌట్ అయ్యారు. ఇండియా-బి బౌలర్లు నవదీప్‌సైనీ 5 వికెట్లు, రాహుల్ చాహర్ 3 వికెట్లు, ముకేష్‌కుమార్ ఒక వికెట్ తీశారు. ఇండియా-బి మొదటి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 170 బంతుల్లో 13 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో మరోసారి బాధ్యాయుతంగా ఆడి 116 సాధించారు. మరో ఓపనర్ జగదీషన్ 13 పరుగులు, సుయాష్ ప్రభుదేశాయ్ 16 పరుగులు చేశారు. జట్టులోకి చేరిన స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ (5) నిరాశ పరిచారు. ముషీర్‌ఖాన్ 5 పరుగులు సాధించగా, నితీష్‌కుమార్ రెడ్డి డకౌట్ అయ్యారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-బి జట్టు 58 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించింది. వాషింగ్టన్ సుందర్ (39), రాహుల్ చాహర్ (0) క్రీజులో ఉన్నారు. ఇండియా-డి బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3 వికెట్లు, థాకరే 2, సౌరభ్‌కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు.

కెనరా బ్యాంకు అధికారుల శ్రమదానం



పరిశుభ్రంగా మారిన రహదారి

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా జేపీనగర్‌లో శ్రమదానం చేశారు. శుక్రవారం ఉదయం 7గంటల నరంచి రెండుగంటల పాటు జేపీనగర్ 8వ స్టేజ్‌ని ప్రధానరోడ్డుపై భారీగా పేరుకుపోయిన చెత్తకుప్పలను శుభ్రం చేశారు. స్వచ్ఛతాపనులు చేపట్టడం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురాదలచినట్లు కెనరాబ్యాంక్ జనరల్ మేనేజర్ కేజే శ్రీకాంత్, రామనాయ్క, భాస్కర్ చక్రవర్తిలు ప్రకటించారు. నగర పరిధిలోని వివిధ కెనరా బ్యాంకులు, హెడ్ ఆఫీసుకు చెందిన 100మంది ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. బ్యాంకు ఉద్యోగులతో కలిసి శ్రమదానం చేసేందుకు స్థానికులు భాగస్వామ్యులైనటు తెలిపారు.

ఆకట్టుకుంటున్న గార్మెంట్స్ ఎక్స్‌పో

బెంగళూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గార్మెంట్స్ టెక్నాలజీ ఎక్స్‌పో 36వ ఎడిషన్ నగరంలో శుక్రవారం ప్రారంభమైంది. నగరంలోని ప్యాలెస్ మైదానంలో ఏర్పాటైన ప్రదర్శన ఈనెల 22వరకు కొనసాగనుంది. దక్షిణభారతదేశానికి సంబంధించి సమగ్రమైన గార్మెంట్స్ టెక్నాలజీపై ప్రదర్శన కావడంతో విద్యార్థులతోపాటు ప్రజలు కూడా ఆసక్తిగా సందర్శిస్తున్నారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రికి సాహ్ని అభిప్రాయం మేరకు 200కుపైగా బ్రాండ్‌లు, కంపెనీలు పాల్గొన్నాయన్నారు.

కోలార్‌లో రోడ్డు ప్రమాదం

● విడిపోయిన తల.. మొండం

● మృతుడు అన్నమయ్య జిల్లా వాసి

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా పరిధిలో గురువారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి తల మొండం వేర్వేరుగా రోడ్డుపై విసిరినట్లుగా పడ్డాయి. హక్కిపిక్కి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం చీకలబైలు గ్రామానికి చెందిన గుణశేఖర్(28) ద్విచక్రవాహనంలో వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డుపై తల, మొండం వేర్వేరుగా ఉండటాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నైపుణ్యంతో సాంకేతికరంగంలో విజయం

బెంగళూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అకడమిక్‌లో నైపుణ్యత సాధించడం ద్వారా సాంకేతికరంగంలో ప్రగతి సాధించవచ్చునని ప్రొఫెసర్ హెచ్‌ఏ రంగనాథ్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ అకాడమీ కళాశాల ఏడో స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ఇండియన్ అకాడమీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సీ సోమశేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్యులుగా పాల్గొన్న ప్రొఫెసర్ రంగనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. డిగ్రీ పూర్తి చేసుకోవడంతో చదువు ముగిసినట్టు కాదని, ఉన్నత విద్యవైపు వెళ్లాలని సూచించారు. సమాజంలో ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులు ఆశాదాయకంగా ఉన్నాయని ఆ దిశగా ప్రయత్నించాలన్నారు. పరిశోధనలవైపు ఆలోచించాలన్నారు. 522మంది యూజీ, 139మంది పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. డాక్టర్ ఎం తిలక, ఎవాల్యుయేషన్ ఆఫీసర్ డాక్టర్ టి శ్రీనివాసరావు, అకడమిక్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రొఫెసర్ రంగనాథ్, డాక్టర్ రామకృష్ణ రెడ్డి, అకడమిక్ అడ్వైజర్ శ్రీకంఠ పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో ప్రముఖులు

కేన్సర్ బాధితులకు అండగా..

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేన్సర్ బాధిత చిన్నారులకు వైద్యసేవలు సమకూర్చడంతో పాటు పౌష్టికాహారం, విద్య సమకూరుస్తున్న యాక్సస్ సంస్థ మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇస్కాన్ సహకారం అందించినట్లు ప్రకటించారు. రాజాజీనగర్‌లోని ఇస్కాన్ మందిరాన్ని బాధిత చిన్నారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి సందర్శించారు. యాక్సస్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ బెంగళూరు కేంద్ర వ్యవస్థాపకురాలు దివ్యశ్రీ మాట్లాడుతూ బాధిత చిన్నారులకు చదువు, ఆశ్రయంతో పాటు ఇతరత్రా సౌలభ్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇస్కాన్ సంస్థ కలిసి రావడంతో బాధిత చిన్నారులతో పాటు కుటుంబీకులకు పౌష్టికాహారం సమకూర్చేందుకు వీలు కలిగిందన్నారు. సమాజంలో క్యాన్సర్ బాధితుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం చూపాలన్నారు. చిన్నారుల క్యాన్సర్ పట్ల జాగృతి మాసోత్సవంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి ఆరంభించారు. సమాజంలో కేన్సర్ పట్ల నిరంతరంగా చైతన్యం తీసుకురాదలచినట్లు దివ్యశ్రీ తెలిపారు.



ఇస్కాన్‌లో కొవ్వొత్తులతో పాల్గొన్న చిన్నారులు